www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 12 నవంబర్ 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ ఎం. హరినారాయణన్ అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మౌలానా చిత్రపటానికి కలెక్టర్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ హరి నారాయణన్ మాట్లాడుతూ మౌలానా ఆజాద్ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా భారత స్వాతంత్రం కోసం పోరాడారన్నారు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రథమ విద్యా శాఖ మంత్రిగా, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఎనలేని సేవ చేశారని కొనియాడారు. విద్య ప్రాధాన్యతను గుర్తించి విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, సాటి చెప్పిన గొప్ప దార్శనికుడు అని పేర్కొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

యుద్ధోన్మాదం నశించాలి.. ప్రజా శాంతి వర్ధిల్లాలి..

పాలస్తీనాకు సంఘీభావంగా వామపక్షాలు ప్రదర్శన

ప్రజాశక్తి -నెల్లూరు పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు ఉపక్రమించడం దుర్మార్గమని, ప్రపంచ దేశాలు కల్పించుకొని శాంతి చర్చలు నిర్వహించేందుకు యుఎన్ఒ ప్రయత్నాలు చేయాలని కోరుతూ వామపక్ష పార్టీలు సిపిఎం, సిపిఐ, న్యూ డెమొక్రసీ, పౌర హక్కుల సంఘం, సిపిఐ ఎంఎల్ సంయుక్త ఆధ్వర్యంలో శాంతి ప్రదర్శన నిర్వహించారు. శనివారం నగరంలోని పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ మీదుగా విఆర్సి సెంటర్లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఈ శాంతి ప్రదర్శన అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నగర కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడి చేయడాన్ని భారత దేశం తొలుత బలపరిచిందన్నారు. దేశంలోని అనేక రాజకీయపార్టీలు ఈ నిర్ణయాన్ని తప్పుపట్టి ప్రశ్నించడంతో వెనక్కు తగ్గిందన్నారు. నేటికీ ఇజ్రాయిల్ చేస్తున్నటువంటి దురాక్రమణను, ప్రజలపై చేస్తున్న దాడులను ఖండించడంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకోకపోవడం దారుణ మన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ యుఎన్ఓ, ప్రపంచ అలీన దేశాలు చొరవ తోటి 1967లో పాలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయిల్ ఇప్పటికే పాలస్తీనాకు చెందిన 70 శాతం భూభాగాన్ని ఆక్రమించడం దారుణ మన్నారు. పౌరహక్కుల సంఘం నాయకులు ఓ

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

అబ్యుల్లరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా శాంతిని కోరాలన్నారు. శాంతివైపు నడిచేందుకు ప్రయత్నాలు చేయాలని, శాంతి కోసం చేసే చర్చల్లో భారతదేశం పాల్గొని ఇజ్రాయిల్ దురాక్రమణ ఆపేందుకు యుఎన్ఒ లో ప్రయత్నం చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల చొరవతో ఈ వారం రోజులు ఇజ్రాయిల్కు వ్యతిరేకంగా , పాలస్తీనాకు మద్దతుగా శాంతి ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎ.ఎం.మోహన్రావు, సిపిఎం నాయకులు కత్తి శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు, అజీజ్, సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్కుమార్, సిపిఐ సీనియర్ నాయకులు రామరాజు, షాన్వాజ్, సిరాజ్, న్యూ డెమొక్రసీ (సిపిఐ ఎంఎల్) నాయకులు రాంబాబు, పౌరహక్కుల సంఘం నాయకులు ఎల్లంకి వెంకటేశ్వర్లు, ఒపిడిఆర్ నాయకులు శివశంకర్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి-నెల్లూరు

వర్షాభావం కారణంగా పంట సాగుబడి చేసేందుకు నీటిని సకాలంలో విడుదల చేసి వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరారు. శనివారం నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలోని రైతు సంఘం నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీరాములు, మూలె వెంగయ్య మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో లేట్ ఖరీఫ్ సీజన్లో సోమశిల, కండలేరు ప్రాజెక్టులలో డెడ్ స్టోరేజ్, ఆవిరి, తాగునీటికి పోను నికరంగా మిగిలే నీటిని సరఫరా చేసే సాధ్యమైన మేర నాలుగు లక్షల ఎకరాలలో వరి పంట సాగవుతుందన్నారు. ఆ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 15న నిర్వహించే ఐఏబి సమావేశంలో ప్రభుత్వం, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులు అఖిలపక్ష రైతు నాయకులను ఆహ్వానించి సలహాలు, సూచనలు చేస్తామన్నారు. రైతు సంఘాల నాయకుల సలహాలు, సూచనల వల్ల జిల్లాలో ఎక్కువ పంటకు నీరిచ్చి వరిసాగుకు

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 10వ తేదీ నాటికి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 46 మండలాల్లో మూడవవంతు వర్షపాతం కూడా నమోదు కాలేదన్నారు. సోమశిలలో ప్రాజెక్టులో 30, కండలేరులో 11 టి ఎంసిల నీటి నిల్వ ఉన్నాయన్నారు. ఇవికాక అక్కడక్కడ కురిసిన వర్షాలు, మెట్టపైర్లు అయిన పొగాకు, నువ్వు, పత్తి, మిరప, కంది, మినుము పంటలకు సాగుబడికి ఉపయోగపడుతుందన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అధికార, అనధికారికంగా సుమారు లక్షకు పైగా మోటారు పంపుసెట్లు ఏర్పాటు చేసుకొని ఇప్పటికే వరినార్లు ప్రారంభించారన్నారు. జిల్లా అధికారులు, మంత్రులు రైతుల సమస్యలను పరిశీలించి సానుకూలంగా పంటల సాగుకు నీటిని కేటాయించి ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర రాజగోపాల్, జిల్లా సహాయ కార్యదర్శి ఓడూరు వెంకట కృష్ణయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోపసాని రమేష్ ఉన్నారు.

ఎర్రమట్టి అక్రమ రవాణా

ప్రజాశక్తి-గుడ్లూరు : రామాయపట్నం ఓడరేవు సమీపంలో ప్రయివేటు ప్లాట్ల వ్యాపారం ఊపొందుకుంది. ప్లాట్లు చదును చేసి అందంగా రూపొందించేందుకు ఎర్ర గులక మట్టి అవసరం కావడంతో స్థానిక నాయకులు అధికారుల ఆండతో సమీపములో ఉన్న చెరువుల్లోని ఎర్ర మట్టి ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు. గుడ్లూరు మండలం, రావూరు చెరువులో నాణ్యమైన ఎర్రమట్టి ఉండడంతో జెసిబి సహకారంతో ఎర్ర మట్టిని రాత్రి, పగలు అన్న తేడా లేకుండా ప్రయివేటు లేఅవుట్ లో తయారు చేసిన ప్లాట్లకు తరలిస్తున్నారు. స్థానిక నాయకులు, అధికారులు కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి మట్టిని తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. రావూరు చెరువు, తోటి స్వర్ణజపురం చెట్టు పొట్లూరు చెరువులో

నుంచి అడవిలో నుంచి మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మట్టి కోసం చెరువులో భారీ గుంతలు తీశారని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎర్రమట్టి అక్రమ రవాణాను ఆపాలని కోరుతున్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు శాఖ గ్రంథాలయం ఈనెల 14. నుంచి 20 వరకు గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం కానున్నవని గ్రంథపాలకురాలు పి నాగరజని తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా 6వ తరగతి నుంచి పది లోపు విద్యార్థులకు చిత్రలేఖనం క్విజ్, వ్యాసరచన, దేశ భక్తి గీతాలు, మాదకద్రవ్యాల పై అవగాహన, మ్యూజికల్ చైర్ ,ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలిచిన విద్యార్థులుకు 20న బహుమతులు అందజేయున్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థికి ఎస్పి ప్రశంసలు

కందుకూరు : పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా జరిగిన వారోత్సవాలలో భాగంగా కందుకూరు గర్ల్స్ హై స్కూల్ ఆవరణలో కందుకూరు పోలీసు వారి ఆధ్వర్యంలో మహిళలు , చిన్న పిల్లలపై లైంగిక వేధింపుల నుండి రక్షణ, సామాజిక బాధ్యత అను అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కందుకూరు బాయ్స్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న నీలం యశ్వంత్ కుమార్ జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతికి ఎంపికైంది.విద్యార్థి నీలం యశ్వంత్ కుమార్ను ఎస్పి తిరుమలేశ్వరరెడ్డి బహుమతి అందజేశారు. ప్రశంసాపత్రంతో అభినందించారు.

15న 'చలో విజయవాడ' : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు

సిపిఎం - ప్రజా రక్షణభేరి ముగింపు సందర్భంగా నవంబర్ 15 చలో విజయవాడ కార్యక్రమానినికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరుతూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శనివారం నగరంలోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ 'ప్రజా రక్షణ భేరీ' కార్యక్రమ ప్రాధాన్యతను వివరించారు. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ అసమానతలు లేని అభివద్ధి కోరుతూ సిపిఎం ప్రజా ప్రణాళికను రూపొందించిందని, అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రాంతాల నుంచి బస్సు యాత్రను నిర్వహించామన్నారు. ఈ బస్సు యాత్రలో ప్రజలు అనేక సమస్యలను సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో అసమానతలు లేని అభివద్ధి కోసం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టాల అమలు కోసం సిపిఎం

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా రక్షణ భేరి కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. ప్రజారక్షణభేరీ ముగింపు సందర్భంగా నవంబర్ 15న వేలాది మందితో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరూ అధిక సంఖ్యలో విజయవాడకు తరలి వచ్చి కార్యక్రమం జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ ఐక్యంగా స్వార్ధపూరిత రాజకీయాలకు వ్యతిరేకంగా నిలబడాలన్నారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, మహిళా శాఖ కార్యదర్శి సంపూర్ణమ్మ, హర్ష, వెంకటేశ్వర్లు ఉన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -సైదాపురం :బిజెపి పాలనలో వ్యవసాయ రంగం నిర్వీర్యం అయిపోయిందని సంయుక్త కిసాన్ అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు డిపి పోలయ్య పేర్కొన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా అధ్వర్యంలో ఈ నెల 27 28వ తేదీలలో విజయ వాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం సైదాపురం పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం డిపి పోలయ్య మీడియాతో మాట్లాడారు. పంటలన్నింటికి ఎం ఎస్ పి నిర్ణయించి చట్ట బద్దత కల్పిం చాలని కోరారు. రైతుల పాలిట ఉరితాడుగా మిగి లిన ఎలక్ట్రిసిటీ బిల్లును ఉప సంహ రించుకోవాలని తదితర డిమాండ్లతో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఐఎఫ్టియు ఉమ్మడి నెల్లూరు జిల్లా కార్యదర్శి కె రమేష్ మాట్లాడుతూ మాట్లాడారు. వెంకట రమణయ్య, కష్ణయ్య,అంకయ్య లు పాల్గొన్నారు.

గాజులు పంపిణీ

కందుకూరు : కందుకూరు గ్రామ దేవత అంకమ్మ తల్లికి మొదటిసారిగా ఆదివారం నిర్వహించిన గాజుల అలంకార సేవ భక్తులలో విశేష స్పందన లభించింది. గాజులు అలంకారం చూడటానికి భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. అమ్మవారికి అలంకరించిన గాజులను, ప్రసాదం, కుంకుమ ఆలయ ఈవో కష్ణవేణి భక్తులకు అందజేశారు. అంతకుముందు మహిళా భక్తులు ఆలయ ఈవో కష్ణవేణికి పసుపు కుంకుమలు అందజేసి, నూతన వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కష్ణవేణి మాట్లాడుతూ శ్రీ అంకమ్మ తల్లి కి నిర్వహించిన గాజులు అలంకారం భక్తులలో విశేష స్పందన వచ్చిందన్నారు. మహిళా భక్తులు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్ల ఏర్పాటులో అవినీతి : జనసేన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :జగనన్న లే అవుట్లలో అంతు లేని అవినీతి చోటు చేసుకొంద ని జనసేన పార్టీ సర్వేపల్లి ని యోజకవర్గం సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ విమర్శించా రు. శనివారం అయన తోటప ల్లిగూడూరు మండలంలోని జ గనన్న లే అవుట్లను పరిశీలిం చారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ పేదలకి ఇళ్ల స్థ లాల పేరుతో ప్రైవేటు భూము ల కొనుగోళ్లలో కోట్లాది రూపా యల కుంభకోణం జరిగింద న్నారు. కొనుగోలు చేసి వాటి లో పూర్తిస్థాయిలో అభివద్ధి చేయకుండానే అసంపూర్తిగా వదిలివేశారాని ఫలితంగా లబ్ధిదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సురేష్ ధ్వజమెత్తారు. తోటపల్లిగూడూరు మండల అ ధ్యక్షుడు అంక్యం సందీప్, కోసూరు నారాయణ, శరత్,ముత్తుకూరు మండల నాయకులు అశోక్, సుమన్, వెంకటాచల మండలం కార్యదర్శి శ్రీహరి, మండల నాయకులు ఖాజా, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

యువతను మభ్యపెట్టొద్దు :టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి -కందుకూరు : ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల 35 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తానని, యువతకు భూటకపు హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చిన జగన్ ఒక్క జనవరి లో కూడా జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసగించారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ ఆరోపించారు. నిరుద్యోగులను నట్టేట ముంచిన ఘనత జగన్మోహన్రెడ్డికే దక్కుతుందన్నారు.

టపాసుల దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని విఆర్సి క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ దుకాణాలను ఎస్పి డాక్టరు కె.తిరుమలేశ్వరరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ ముందుగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజలు ప్రమాదరహితంగా, ఆనందంగా దీపావళి జరుపుకోవాలని పిలుపు నిచ్చారు. బాణసంచా విక్రయ దుకాణాల వద్ద అగ్నిప్రమాదం నివారించడానికి బకెట్ లలో నీరు, ఇసుక తదితర అగ్నిమాపక పరికరాలను, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యల తీసుకోవాలన్నారు.

'ఆక్స్ఫర్డ్'లో ముందస్తు దీపావళి వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణంలోని స్థానిక పామూరు రోడ్డులో నున్న బిఆర్ ఆక్స్ ఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్లో శుక్రవారం ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని వారి ఆనందాన్ని వ్యక్తపరిచారు. శ్రీకష్ణుడు, సత్యభామ, నరకాసురుడు వేషధారణ లలో బాల బాలికలు అలరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు మాట్లాడుతూ ఏ యుగంలోనైనా చెడుపై మీద మంచి విజయం సాధిస్తుందన్నారు. నరకాసురుని మీద శ్రీకష్ణుని విజయమే ఉదాహరణ అని తెలిపారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి

వెంకటేశ్వర్లు,కాలేజీ డైరెక్టర్ బి.నరేంద్ర బాబు,డీన్ ఎం రామారావు, ప్రిన్సిపాల్స్ ఎం మల్లికార్జున,నజీర్,సునీత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొదలకూరు :పట్టణంలోని అమరావతి పాఠశాలలో ముందస్తుగా గ్రీన్ దీపావళి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆ పాఠశాల కరెస్పాండెట్ కె.సురేష్ మాట్లాడుతూ చీకటిని ప్రాలద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా,విజయానికి ప్రతీకగా ఈ దీపావళి పండుగ జరుపుకుంటారని తెలిపారు. పర్యావరణానికి హాని కలుగకుండా మట్టితో చేసిన ప్రమిదలను, కొవ్వొత్తి దీపాలను మాత్రమే వెలిగించాలన్నారు. విద్యార్థులు తయారు చేసిన మట్టి ప్రమిదలు, రంగు రంగు ముగ్గులు, సాంస్కతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటా టిడిపి ప్రచారం

ప్రజాశక్తి నెల్లూరు సిటీ :వైసిపి ప్రభుత్వ అరాచక పాలనలో ప్రజలు విసిగివేశారిపోయారని వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు సిద్ధాంగా ఉన్నారని మాజీ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు నగరం 6వ డివిజన్ స్టోన్ హౌస్పేటలో బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలతో కలిసి శనివారం ఆయన పాల్గొన్నారు. డివిజన్లోని ప్రతి షాపులో కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. నియోజకవర్గ పరిశీలకులు షేక్ కరీముల్లా, 6 డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ శంకర్ కొండ ,డివిజన్ ఇంచార్జి గుట్ట అన్నపూర్ణ ఉన్నారు.

కందుకూరు : బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం టిడిపి ఇన్ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు నిర్వహించారు. కందుకూరు పట్టణంలోని 14వ వార్డు శ్రీనగర్ కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేశారు. అనంతరం ఇంటింటి ప్రచారంలో నాగేశ్వరావు పాల్గొన్నారు. పార్టీ మినీ మేనిఫెస్టోలోని తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ఉచిత బస్సు ప్రయాణం, బిసిలకు రక్షణ చట్టం, అన్నదాతలకు ఆర్థిక సాయం, యువతకు ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగ భతి, ఇంటింటికి సురక్షిత నీటి సరఫరా అంశాలను స్థానికులకు నాగేశ్వరరావు వివరించారు.పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వర రావు, వార్డు అధ్యక్షుడు గుమ్మడి బ్రహ్మయ్య స్థానిక నాయకులు దార్ల శ్రీను, దార్ల మాలకొండయ్య, పోలయ్య, దార్ల వెంకటేశ్వర్లు, కాకుమాని మాల్యాద్రి, మల్లెబోయిన ప్రసాద్, గుమ్మడి

శివ, తూపిలి వెంకటరావు, గల్లా రాధాకష్ణ, గళ్ళ హరి, గోలి ఏడుకొండలు, యల్లంటి మాల్యాద్రి, కోటపురి శీను, బెంగళూరి సుధాకర్, బాబీ, అజయ్, వెంకట్రావు, చక్రవర్తి, సాయి అశోక్, చెంచు కష్ణయ్య, బలరాం రాజు, వెంకట్రావు, మాధవ పార్టీ నాయకులు కంద్రా మాల్యాద్రి, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, వడ్డెళ్ల రవిచంద్ర, బెజవాడ ప్రసాద్, రావి వెంకటేశ్వర్లు, షేక్ మున్నా, ముచ్చు వేణు, పులి నాగరాజు, సయ్యద్ జియావుద్దీన్, షేక్ కరిముల్లా, మచ్చా మనోహర్, గౌస్ బాషా, గుమ్మా శివ, మచ్చ మనోహర్, మనికే మాల్యాద్రి, లింగాబత్తిన మాల్యాద్రి ఉన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్కు నివాళి

కందుకూరు : స్వాతంత్ర సమరయోధుడు, భారతదేశపు తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణలోని వైసిపి కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కందుకూరు పట్టణ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఆవాజ్ ఆధ్వర్యంలో...

దేశపు తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్కలాం అజాద్ ఎనలేని సేవలు చేస్తే, నేటి ప్రభుత్వాలు మైనారిటీలకు విద్యను దూరం చేస్తున్నాయని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ పేర్కొన్నారు. శనివారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135 జయంతిని పురస్కరించుకొని ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీనగర్ టాక్సీ స్టాండ్ వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ

మైనారిటీల్లో విద్య కోసం కృషి చేసిన వ్యక్తి భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఆయన దేశానికి ఎనలేని సేవలు చేశారన్నారు. మౌలాన అబ్దుల్ కలాం ఆజాద్ ఆయన కలలు కన్న కలలను నిజం చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చడంలో విఫలమైనాయన్నారు. మైనారిటీ ఇస్తున్న స్కాలర్షిప్లను రద్దు చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వది అన్నారు. రద్దు చేసిన స్కాలర్షిప్ లను తిరిగి తెప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, నగర అధ్యక్షులు షేక్ ఫయాజ్, నగర కమిటీ సభ్యులు షేక్ ఇమ్రాన్, షేక్ ఖాజా, షేక్ ఉస్మాన్, షేక్ ముస్తాక్ పాల్గొన్నారు.

దీపావళి శుభాకాంక్షలు

కందుకూరు :ఎంఎల్సి కంచర్ల శ్రీకాంత్ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంతోషంగా దీపావళి జరుపుకుంటారన్నారు. దీపావళి సం దర్భంగా ప్రతి ఒక్కరి జీవితాల్లో కాంతులు వెదజల్లాలని కోరు కుంటూ, దీపావళి పండగని సంతోషంగా కుటుంబ సభ్యులతో జాగ్రత్తగా జరుపు కోవాలని ఎంఎల్సి శ్రీకాంత్ కోరారు.

కందుకూరు నియోజకవర్గ ప్రజలకు నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ ఒక ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో చీకట్లు తొలగిపోయి వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.

కందుకూరు నియోజకవర్గ ప్రజలకు కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంతోషంగా దీపావళి జరుపుకుంటారని,ప్రజలందరూ కుటుంబ సభ్యులతో జాగ్రత్తగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు కషి చేయాలని పిసిసి ఉపాధ్యక్షులు ఉడత వెంకట్రావు, డిసిసి ఉపాధ్యక్షులు టి.బాల సుధాకర్ కోరారు. స్థానిక గాంధీ నగర్ లో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఉడత వెంకట్రావు యాదవ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ , సమన్వయకర్త టి.బాల సుధాకర్లు హాజరై రూరల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసు కొచ్చేందు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు అన్యం లతా రెడ్డి, షేక్ అల్లావుద్దీన్ రూరల్ అధ్యక్షులు షేక్ హుస్సేన్ భాష,రూరల్ సమన్వయకర్త సయ్యద్ రహమతుల్లా ,హాజీ షేక్ మొహమ్మద్ , హనీఫ్ , కె. ఆదినారాయణ, షేక్ చాన్ బాషా, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సయ్యద్ నసిమ ,రూరల్ అధ్యక్షురాలు సయ్యద్ , నాగూర్, బి పటాన్ అబ్దుల్ ల్లా, షేక్ మా బాషా, కన్నా ,సయ్యద్, సమీర్, అబ్దుల్ ,ఘని ఉన్నారు.

రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం శనివారం నిర్వహించారు. నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపి నుంచి జిల్లా ఫుట్బాల్ కోచ్ ఎన్.సాయిరాం, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి గురుప్రసాద్, ఎపి రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ తరపున పి.శ్రీకాంత్రెడ్డి హాజరయ్యారు. ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి శ్రీనివాసులు వ్యవహరించారు. రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ప్రెసిడెంట్గా మాలెం సుధీర్కుమార్రెడ్డి, కార్యదర్శిగా కిడాంబి కామేష్, ఉపాధ్యక్షులుగా షేక్ షమీర్ ఆలీ అబ్జల్, మాగులూరు హరిబాబు, కోశాధికారిగా రుద్రరాజు సుధాకర వర్మ, జాయింట్ సెక్రటరీగా కె.రమేష్, జి.ఈశ్వర్బాబు ఎంపికైనట్లు ప్రకటిం చారు. ఈసి సభ్యులు వి.భరద్వాజ, సిహెచ్ జితేంద్ర ఉన్నారు.

వైసిపి సామాజిక బస్సు యాత్రకు స్పందన లేదు..

ప్రజాశక్తి-కందుకూరు : వైఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని జగన్ జీతగాళ్లు అయిన వాలంటీర్లు ,గహసారథులు, సచివాలయ సిబ్బంది బలవంతంగా పోలీసుల కాపలా మధ్య జరుపుతున్నారని జనం ఎవరు స్వచ్ఛందంగా రావడం లేదని దళిత నేత నీలం నాగేంద్ర రావు తెలిపారు. శనివారం కందుకూరులో ఆయన మాట్లాడారు. నేతి బీర పేరు లో నెయ్యి లేనట్లు జగన్ సామజిక సాధికార యాత్ర అంతేనన్నారు. వైఎపి నీడ్స్ జగన్ అనే కార్యక్రమంపై నియోజకవర్గాల వారీగా జగన్ ప్రభుత్వం ఎస్సి, ఎస్టి, బిసిలతో సమీక్ష నిర్వహించాలన్నారు. జగన్ సామాజిక అన్యాయ యాత్రకు నిరసనగా భవిష్యత్తు కార్యాచరణ కోసం ఈ నెల 11న విజయవాడ ప్రెస్ క్లబ్ లో దళిత సంఘాల సమావేశం జరుగుతుందని ఈ సమావేశానికి ప్రతిపక్ష రాజకీయ పార్టీలే కాకుండా వైఎస్ఆర్ పార్టీలోని ఎమ్మెల్యేలు ఎస్సీ ఎస్టీ నాయకులు కూడా హాజరు కావాలని నీలం నాగేంద్రరావు కోరారు. దళిత నాయుకులు పాలేటి కోటేశ్వరరావు,దారా అంజయ్య, తానికొండ ఆనంద్ కసుకుర్తి రాజు, వడ్డీముక్కల సురేష్ ఉన్నారు.

బిటిఎ జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని ఎంపిపిఎస్ దర్గామిట్ట పాఠశాల ఆవరణంలో బిటిఎ జిల్లా శాఖ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశం ప్రారంభోత్సవానికి ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ , జ్యోతిరావు పూలే చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశం నిర్వహించి, బిటిఎ జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం చేశారు. ఈ ఎన్నిక కార్యక్రమానికి పరిశీలకులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలగుంట మోహన్రావు హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చినటువంటి హామీలను ఒక్కటి కూడా నెరవేర్చకుండా నిరంకుశ విధానంలో ముందుకు పోతుందన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లం వేణుగోపాల్ మాట్లాడారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుక కార్యక్రమం నిర్వహించారు. నూతన కమిటీ జిల్లా గౌరవాధ్యక్షులు పి చిన్నయ్య , గౌరవ సలహాదారు పి.జి.డి కపాల్ , అధ్యక్షులుగా మణి సుబ్బు , అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్ కే అబ్దుల్లా ,వర్కింగ్ ప్రెసిడెంట్ జి శ్రీనివాసులు , ప్రధాన కార్యదర్శిగా మాస ప్రసాద్ ఎన్నికయ్యారు.

జూపూడి వ్యాఖ్యలకు రామిరెడ్డి క్షమాపణ

ప్రజాశక్తి-కావలి : ఇటీవల జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్ర సందర్భంగా జరిగిన బహిరంగ సభలో వైసిపి ఎస్‌సిసెల్ రాష్ట్ర అధ్యక్షులు జూపూడి ప్రభాకరరావు బ్రాహ్మణులను కించ పరిచే వ్యాఖ్యలు చేయడంపై స్థానిక బ్రాహ్మణ మహాసభ బాధ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి మనోభావాలు దెబ్బతిన్నందున చింతిస్తు శనివారం కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి బ్రాహ్మణ మహాసభ సభ్యులకు క్షమాపణలు చెప్పారు. కాగా బ్రాహ్మణులను కించపరుస్తూ మాట్లాడిన జూపూడి వివాదాస్పద వ్యాఖ్యలను ఖండిస్తూ జిల్లా అధ్యక్షులు గుడ్లదన వాసుదేవరావు, కావలి సంఘం అధ్యక్షులు పి.వి.ఎన్. ప్రసాద్, ట్రెజరర్ టి.వి.ఎం.ఎస్. ప్రకాశరావు, స్టేట్ వైస్‌ప్రెసిడెంట్ ఎం.వి.ఎస్.రాజేంద్రకుమార్, స్టేట్ ఈసీ మెంబర్స్ టంగుటూరి పవన్‌కుమార్, గంగు.చంద్రశేఖర్, సంఘం సెక్రెటరీలు ఎ.వి.చలపతిరావు, గుండా పంతుల శ్రీనివాసరావు, శ్రీ కన్యకా పరమేశ్వరి రాజశేఖర్, ఎక్స్ కౌన్సిలర్ రమణారావు, ఇంకా ఇతర సంఘ సభ్యులు కావలి ఎం.ఎల్.ఎ. రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి తమ జాతికి జరిగిన అవమానాన్ని సరిదిద్దాలని, వినతి పత్రాన్ని ఇచ్చారు. జిల్లా అధ్యక్షులు గుడ్లదన వాసుదేవ రావుతో కూడా మాట్లాడి, ప్రెస్‌మీట్ పెడతామని కూడా చెప్పారు. తాము కోరిన వెంటనే తమ సమస్యను పరిష్కరించి, స్పందిస్తూ బ్రాహ్మణ మహాసభకు క్షమాపణ చెప్పిన ఎంఎల్ఎ రామిరెడ్డికి, బ్రాహ్మణ మహా సభ ధన్యవాదాలు తెలియజేసింది.

నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం నాగులవరం గ్రామస్తులు కాంగ్ర గంగినాయుడు కుమారుడు కాంగ్ర సతీష్, సతీష్ నాయుడు యువసేన తరఫున భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రానికి శనివారం రూ.15వేల విలువచేసే నిత్యావసర వస్తువుల వితరణ అందజేశారు. ఈ సందర్భంగా ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ సింహాద్రి రావు మాట్లాడుతూ సతీష్ నాయుడు ఆదరణ కేంద్రంలోని అనాథలను గుర్తించి వారికి సహాయం అందజేయడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఆదరణ కేంద్రం వ్యవస్థాపకులు ఎస్.వి.పాలెం మాజీ సర్పంచ్ కట్టెపల్లి భవాని, యువసేన సభ్యులు బావట్ల వెంకటపతి, ప్రత్యూష్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సహిత దీపావళిని జరుపుకోవాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కులమతాలకు అతీతంగా ప్రతీఒక్కరూ ఆనందంగా జరుపుకునే దీపావళి పండుగను ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలు పూర్తిగా ఆస్వాదించేందుకు పర్యావరణహితంగా జరుపుకోవాలని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆకాంక్షించారు. నరకాసురుని పీడను శ్రీ కృష్ణ సత్యభామ లు ఆయన సత్యభామ వధించి లోకానికి ఆనందంగా కలుగజేసిన సందర్భంగా నరకాసురుడి హతంతో పాటు శ్రీ కృష్ణ ప్రతీకగా పండుగ జరుపుకోవడం ఆనవాయితీ అని అన్నారు. ప్రతిఒక్కరూ సంతోషకరమైన, ప్రమాదరహిత, ఆరోగ్యకరమైన దీపావళిని జరుపుకోవాలని కోరారు.

కాలుష్య రహిత దీపావళిని జరుపుకోవాలి : జెవివి

ప్రజాశక్తి-కావలి : దీపావళి పండుగను కాలుష్య రహితంగా, సురక్షితంగా జరుపుకోవాలని కావలి పట్టణ ప్రజలకు జన విజ్ఞాన వేదిక పట్టణ శాఖ అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. దీపావళి టపాకాయలు పేల్చడం వల్ల వాతావరణం కలుషితమవుతుందనేది శాస్త్రీయంగా నిరూపితమైందన్నారు. టపాకాయలు పేల్చడం వల్ల విడుదలయ్యే ధూళి, వాయు కాలుష్యాలు, శబ్ద కాలుష్యాల వంటివి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయన్నారు. గాలిలో ఆక్సిజన్ తగ్గి కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్, ఆక్సైడ్ వంటి కాలుష్యాలు పెరుగుదల వల్ల శ్వాస తీసుకోడం ఇబ్బంది గామా ఆస్తమా, గుండె జబ్బు, కేన్సర్ వంటి ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని తెలియజేశారు. కాలుష్య రహిత, ఆరోగ్య భద్రత-దీపావళి జరుపుకొని భావితరాలకు కాలుష్య రహిత, మంచిఆరోగ్య సమాజాన్ని అందించడం పౌరులగా ప్రథమ కర్తవ్యమని తోట వెంకటేశ్వర్లు తెలియజేశారు.

సాంస్కృతిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : విశ్వోదయలోని డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో జవహర్ భారతి ఎం.ఐం. హాలులో డాక్టర్ డి.ఆర్. విశ్వోదయ బాలల దినోత్సవ సాంస్కృతిక పోటీలను శనివారం కావలి తహశీల్దార్ మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను జవహర్ భారతి పూర్వవిద్యార్థిని అయినందుకు గర్విస్తున్నానన్నారు. విద్యార్థులలోని ప్రతిభ, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు, నియోజకవర్గ స్థాయిలో ఇలాంటి పోటీలు నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. విశ్వోదయ రిజిస్ట్రార్ దొడ్ల విన్సెంట్‌కుమార్ రెడ్డి, రామ్‌సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కరణం తిరిరెడ్డి, ఆర్గనైజర్ జ్యోతిర్మణి పాల్గొన్నారు. మొదటిరోజు చిత్రలేఖనం, ఇంగ్లీష్ రైమ్స్, తెలుగు పద్యాలు, పాటల పోటీలు జరిగాయి. న్యాయ నిర్ణేతలుగా రామచంద్రయ్య, అరుణ, అమరావతి, ఎం.శిరీష, ఎల్.ఎస్.శిరీష, ఎస్.లక్ష్మీ ప్రశాంతి వ్యవహరించారు. కృష్ణప్రసాద్, పిడి ప్రసాద్ రెడ్డి, భార్గవ్, నల్లూరు రామకృష్ణ తమ సేవలందించారు.

టెన్నిస్, క్రికెట్ టోర్నమెంట్లు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : కాపు సంక్షేమ సేన (కెఎస్ఎస్) ఆధ్వర్యంలో ముద్దన వెంకట నారాయణ జ్ఞాపకార్థం శనివారం కావలిలోని కెజిఎస్ స్టేడియంలో టెన్నిస్, క్రికెట్ టోర్నమెంట్స్ ప్రారంభించడం జరిగినది. ఈ ప్రారంభానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రభాకర్ నాయుడు, కెఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు సుధాకర్, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మిసు వెంకటసుబ్బయ్య, ప్రముఖ న్యాయవాది పొట్లూరి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఇందులో సుమారు 50 టీములు పాల్గొన్నాయి. విన్నింగ్ టీముకు ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ సోమవారం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కావలి కెఎస్ఎస్ అధ్యక్షులు సాదు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పసుపులేటి బాబూరావు, ఉపాధ్యక్షులు పాలడుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేస్తూ యువతను ప్రోత్సహిస్తున్నామన్నారు.

గీత కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి-విడవలూరు : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్లుగీత కార్మికులను పట్టించుకోలేదని కోవూరు టిడిపి ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం మండలంలోని పార్లపల్లి గ్రామంలో ప్రతీఇంటికి ప్రజల కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో టిడిపి అధికారంలోకి వస్తే చేయు సంక్షేమ అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు తెలియజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాము అధికారంలోకి వస్తే చెట్లకు పనులేకుండా గీత కార్మికులకు లైసెన్సులు మంజూరు చేస్తామని విధిగా పన్ను చెల్లింపు హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చెముకల కృష్ణచైతన్య, ఐటిడిపి కన్వీనర్ సత్యాలో సత్యారెడ్డి, మండల అధ్యక్షులు చెముకల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు మాతూరు శ్రీనివాసులురెడ్డి, నాయకులు బండ్ల నవీన్, బండ్ల సురేష్ పాల్గొన్నారు.

ముగిసిన నెట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న 67వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -17 నెట్‌బాల్ బాల బాలికల పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ స్కూల్ గేమ్స్‌లో 13 జిల్లాలకు చెందిన 360మంది క్రీడా విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. సెమీఫైనల్‌లో ముగియడంతో ఫలితాలు ఫైనల్‌కు చేరుకున్నాయి. బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జట్టు, విశాఖ జట్టుపై 10 -08 గోల్స్‌తో విజయం సాధించారు. నెల్లూరు జట్టు అనంతపురం జట్టుపై 12-07 గోల్స్‌తో నెగ్గింది. బాలిక విభాగంలో విశాఖ జట్టు పశ్చిమగోదావరి 08-07 గోల్స్‌తో విజయం సాధించారు. నెల్లూరు జట్టు తూర్పుగోదావరి జట్టుపై 11-05 గోల్స్‌తో నెగ్గారు. క్రీడాకారులకు సిబ్బందికి సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వర్ రెడ్డి మూడు రోజులపాటు భోజనం ఏర్పాటు చేశారు. ఎస్‌జిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పీడీలు ఎన్.విజయ్, తిరుపతయ్య, నేతృత్వంలో ఏర్పాట్లు కొనసాగాయి. ఎస్‌జిఎఫ్ మేనేజర్ మహబూబ్ చేతుల మీదుగా విజేతలకు షీల్డ్ ప్రశంసా పత్రాలు అందజేశారు. సూరా భాస్కర్ రెడ్డి, కుదుములు సుధాకర్ రెడ్డి, కంచి పరమేశ్వర్ రెడ్డి, ప్రయివేట్ పాఠశాల సంఘం అధ్యక్షుడు మల్లికార్జున, పిఇటీ కామిరెడ్డి ఎస్ఆర్, తదితరులు పాల్గొన్నారు.

డోర్ డెలివరీలో కావలి డిపో ప్రథమం

ప్రజాశక్తి-కావలి : డోర్ డెలివరీ మాసోత్సవాల సందర్భంగా బుకింగ్‌లో కావలి డిపో ఇప్పటివరకు ప్రథమ స్థానంలో నిలిచిందని ఎపిఎస్ ఆర్‌టిసి కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. శనివారం కావలి కార్గో కేంద్రంలో గతవారం రోజులుగా కనీసం నాలుగు డోర్ డెలివరీ పార్సిళ్లను బుక్ చేసిన వినియోగదారులకు పేర్లు లక్కీ డ్రా తీసి బహుమతులను అందజేశారు. బాలాజీ ఫర్నిచర్, ఫెలిసిటీ చన్నా వెంకటప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొని లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు ఫ్యాన్సీ బీరలను బహుమతులుగా అందజేశారు. పట్టణానికి చెందిన యస్ శ్రీనివాసులు, టి రోశయ్య, ఒంగోలు నగరానికి చెందిన చిల్లి మహేష్ బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కేదారీ బాబు, మార్కెటింగ్ ఇన్‌ఛార్జి డి రవిప్రకాష్, మార్కెటింగ్ టీం సభ్యులు ఎస్‌కె మస్తాన్, పి జనార్దన్‌రావు పాల్గొన్నారు.

ఆలయ భూములు వేలం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : మండలంలోని పెనుబల్లి గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానానికి చెందిన సర్వే నెంబర్ 284/సిలోని ఎ. 1.29 సెంట్లు, కోవూరు మండలం పాటూరు గ్రామంలోని సర్వే నెంబర్ 479లోని ఎ 1.50సెంట్లు, సంచిసెడ ప్రత్యేక ధర్మదాయ సంస్థకు చెందిన ఇందుకూరుపేట మండలం పున్నూరు గ్రామంలోని మొత్తం ఎ 8.65 సెంట్ల మాగాణి మెట్ట భూములకు 3 సంవత్సరాలు కౌలుపరిమితికి గాను శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. రూ.1,32,000లు ఆదాయం లభించింది. ఆలయ చైర్మన్ పుట్ట లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి విరుపాక్షుల గిరిక్ష్మ, అధికారులు, దేవస్థాన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారక్షణభేరి జయప్రదానికి పిలుపు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కోవూరు

15వ తేదీన విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరీ సభను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కోవూరులోని సీతాపోలయ్య భవనంలో గోడపత్రిక ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గండవరపు శేషయ్య మాట్లాడుతూ దేశంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి దేశాన్ని రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రానికి పత్యేక హోదా, విభజన హామీలు గాలికొదలి, దేశంలో డీజల్ ధరలు పెట్రోల్ ధరలు పెరిగాయాని, ముత్తుకూరు పోర్టులో కనీస వేతనాలు అమలు, ఉద్యోగ భద్రత చట్టాలు అమలు చేయడం లేదని తెలిపారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి దానికి బదులు జిపిఎస్ సిస్టమ్ తీసుకొచ్చి ఉద్యోగులు నష్టపడే విధంగా చట్టాన్ని తెచ్చారన్నారు. ఈ రాష్ట్రం అప్పులు ఊబిలో కూలిపోయిందని ఒక పరిశ్రమ గానీ, ఒక ఉద్యోగం గానీ స్థితిలో లేదని, దేశంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పంపాలని తెలియజేశారు. రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు నడుస్తున్నాయని కొనియాడారు. పోలవరం, రాజధాని అసంపూర్తిగానే మిగిలాయని రాష్ట్రం అభివృద్ధి లేకుండా పోయిందని విమర్శించారు. విజయవాడలో జరిగే 15వ తేదీ ప్రదర్శన, బహిరంగ సభను ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోవూరు మండల కమిటీ నాయకులు బాబు, సుబ్బారావు, ఖాదర్ బాషా, రమేష్, ఛాన్‌బాషా, సురేంద్ర, సురేష్ మాబాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి బుచ్చిరెడ్డిపాలెం : 15న విజయవాడలో జరిగే సిపిఎం ప్రజా రక్షణ బేరి మహాసభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆయన శనివారం సిపిఎం కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాల అవలంభిస్తున్నామన్నారు. బిజెపి పాలనలో దేశం అస్తవ్యస్తంగా తయారైందని ప్రభుత్వరంగ సంస్థలను బడా పెట్టుబడీదారులకు అప్పగిస్తున్నారన్నారు.

బుచ్చిలో...

వారు మత ఉద్రిక్తతలన రేపి పరిపాలన కొనసాగించాలనుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం కేంద్రం అడుగులకు మడుగులు వత్తుతూ వారి ఆజ్ఞలను తూచే తప్పకుండ పాటిస్తూ ప్రజలపై మోయలేని భారాలను వడ్డిస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రభుత్వ వనరులను దోచుకుంటుందని ప్రశ్నించిన వారిపై అక్రమ అరెస్టులు, కేసులు విధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున, సిపిఎం పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు, ఆవాజ్ నాయకులు షేక్ జానీభాషా, షేక్ మునీర్ అహ్మద్, షేక్ ఖాదర్ బాషా, బాబు, సిపిఎం నాయకులు సురేష్, రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

తక్షణ చర్యలతో ప్రజల దాహార్తిని తీర్చాలి

ప్రజాశక్తి-జలదంకి : జలదంకి, కావలి మండలాల్లో తక్షణం చర్యలు చేపట్టి ప్రజల దాహార్తిని తీర్చాలని రైతు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం చిన్నక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నక్రాక రిజర్వాయర్‌ను సోమశిల నీటితో నింపి జలదంకి మండలంలోని గ్రామాలకు, కావలి మండల ప్రాంతప్రజల దహార్తిని తీర్చాలన్నారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బలిజపల్లి వెంకటేశ్వర్లు, ఎపి వ్యకాసం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు మాట్లాడుతూ గత 40 సంవత్సరాల కాలంలో ఇలాంటి వర్షాభావం ఎప్పుడు చూడలేదన్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని, పాలకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఈ విషయంపై కలెక్టర్ పరిశీలించి తక్షణమే తాగునీటిని ప్రజలకు అందించాలని విజ్ఞప్తి చేశారు. జమ్మలపాలెంలో ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ పూర్తిస్థాయిలో నింపి కావలి పట్టణ ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. ఇప్పటికే కావాలి పట్టణంలోని బుడంకుంట కాలనీ పలు ప్రాంతాలలో తాగునీటి కొరత ఏర్పడిందని ట్రాక్టర్లతో తాగునీరు అందజేస్తున్నారన్నారు. గ్రామస్తులు ఉన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-వరికుంటపాడు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు సంక్షేమ పథకాలపై జెసిఎస్ మండల కన్వీనర్ బొడ్డు వెంకటేశ్వర్ రెడ్డి అవగాహన కల్పించారు. శనివారం మండలంలోని రామాపురం, హుస్సేన్ నగర్, వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమంలో భాగంగా జెసిఎస్ కన్వీనర్ బొడ్డు వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు ఇంటింటికి తిరిగి గత టిడిపి పాలనకు ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి పాలనకు ఉన్న తేడా జరిగిన అభివృద్ధిపై ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు దారపునేని చెన్నారాయుడు, రాయవరపు మధుసూదన్ రావు, దుగ్గినేని విజయలక్ష్మి, నాయకులు మందలపు తిరుపత నాయుడు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు 100 అబద్ధాలు చెప్పి అధికారం చేపట్టి ప్రజలను నిట్టనిలువునా ముంచేశాడన్నారు. ప్రస్తుత సిఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తూ ప్రజల మన్నలను పొందుతున్నారని తెలిపారు. జగనన్న పాలనలో అర్హతే ప్రామాణికంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అన్ని వర్గాల వారికి సముచిత న్యాయం చేస్తూ ప్రజాభిమానం చురగొంటున్నారన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డిని సిఎంగా ఎంఎల్ఎ మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేడసాని చెన్నకేశవులు, తూర్పు చెన్నంపల్లి సర్పంచ్ యరమల ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో 10 వాటర్ ప్లాంట్లు

ప్రజాశక్తి-కోవూరు : జిల్లాలోని 10 బిసి సంక్షేమ వసతి గృహాల్లో ఆక్వాగార్డ్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేలా కలెక్టర్ హరినారాయణన్ చొరవ తీసుకున్నారని, అందుకు తమ విద్యార్థుల తరపున ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఎంపవర్మెంట్ అధికారి వై.వెంకటయ్య అన్నారు. కోవూరులోని బిసి బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను శనివారం ఆయన పరిశీలించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఇచ్చిన సదుపాయాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'భూ రక్ష - భూ హక్కు'

ప్రజాశక్తి-సీతారామపురం : జగనన్న భూ రక్ష - భూ హక్కు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న భూ రీసర్వేను అధునాతన టెక్నాలజీతో భూములను సర్వే చేయడానికి మండలంలోని గంగవరం గ్రామంలో డ్రోన్ కెమెరా ద్వారా భూమి వివరాలను గుర్తించినట్లు తహశీల్దార్ ఎంవికె.సుధాకర్ బాబు తెలిపారు. రెవెన్యూ గ్రామాలలో ఉన్న భూములను డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి తదుపరి సర్వే చేసి సులభతరంగా అతి తక్కువగా సమయంలో రైతులకు వారి భూముల హద్దులను కేటాయించి భూహక్కు కల్పిస్తామన్నారు.

దుకాణదారులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని జి.నరసారెడ్డి సత్రంలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన టపాసులు దుకాణాలు శనివారం కోవూరు సిఐ డి.వెంకటేశ్వరరావు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్, తదితరులు ఉన్నారు.

విరాళం అందజేస్తున్న దృశ్యం

రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాలెంలో వెలసిన శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.10లక్షల విరాళం అందజేశారు. ఇటీవల బుచ్చిరెడ్డిపాలెంలో పర్యటన సందర్భంగా శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆలయానికి తన వంతుగా ఈ విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ కేతరాజు కేశవరావు, వైస్ ప్రెసిడెంట్ కె.కోటేశ్వరరావు, సెక్రటరీ దర్శి బాలనరసింహారావు, గౌరవాధ్యక్షులు టంగుటూరి మల్లిఖార్జున రెడ్డి, జాయింట్ సెక్రటరీ కాసా శ్రీనివాసులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా..

ప్రజాశక్తి-ఉదయగిరి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతమైన ఉదయగిరిని జిల్లాగా గుర్తించి అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి దుద్దుకూరి రమేష్ నాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక మీడియా పాయింట్‌లో నియోజక వర్గస్థాయి కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో ఎనిమిది మండలాలు కరువు కాటకాలకు నిలయంగా మారి వలసలకు మారుపేరుగా ఉదయగిరి నిలిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రారంభమైన పెద్దిరెడ్డిపల్లి పూల సుబ్బయ్య రిజర్వాయర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి పూర్తి చేస్తామన్నారు. ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు ఉదయగిరి నుంచి నందవరం వెళ్లే రోడ్డు గురించి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఆ రోడ్డులో ప్రయాణం సాగించలేక ఎంతోమంది అంబులెన్స్ లోనే ప్రాణాలు కోల్పోయారని ప్రజలపై కనికరం చూపించి రోడ్డు పూర్తయ్యేలా చొరవ చూపాలని, అధికార పార్టీ నాయకులను చర్యలు తీసుకోవాలని కోరారు. జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ విజయం సాధిస్తుందని తెలంగాణలో వలస ఓట్లు చీలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ప్రతి ఓటరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఉదయగిరి నియోజకవర్గాన్ని ప్రత్యేక కరువు మండలంగా ప్రకటించి ఇక్కడ రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో గానీ దేశంలో గానీ సమగ్ర అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిందేనని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మరుక్షణం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై మొదటి సంతకం పడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎస్ బాలయ్య, సీతారామపురం మండల కన్వీనర్ కానాల హజరత్, ఉదయగిరి మండల కన్వీనర్ ఫజిల్, దుత్తలూరు మండల కన్వీనర్ రాంబాబు, వరికుంటపాడు మండల కన్వీనర్ ముజీబ్, జలదంకి మండల కన్వీనర్ నరేంద్ర, కొండాపురం మండల కన్వీనర్ దుర్గాప్రసాద్, అన్ని మండలాలకు సంబంధించిన పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

లిఫ్ట్ ఇరిగేషన్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు చెరువుకు సాగునీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ తుపానుకు దెబ్బతిని ఉన్నందువల్ల ఆ స్కీములు ప్రభుత్వం పునరుద్ధరింపజేసి రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం నాయకులు లక్ష్మీపతి, కృష్ణమోహన్, కృష్ణ ప్రసాద్ కోరారు. ఆ మేరకు వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు చెరువు పరిధిలో సుమారు 1400 ఎకరాల హైకోర్టు ఆయకట్టు ఉందన్నారు. చెరువు పరిధిలోని తూముల ద్వారా సాగనీరు సక్రమంగా అందకపోవటతో ప్రభుత్వం నుంచే గతంలో రూ.14 కోట్లతో ప్రత్యేక స్కీం ఏర్పాటు చేశారని తెలిపారు. 2022లో వచ్చిన తుపాను కారణంగా స్కీం దెబ్బతిని సాగునీరు లిఫ్ట్ చేయలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దాంతో రైతులు పంటలు పండించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏడాది ఇప్పటివరకు చెరువుకు అవసరమైన నీరు చేరలేదని అందువల్ల రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

పాల్గొన్న రైతులు, రైతు సంఘాల నాయకులు

సోమశిల ప్రాజెక్టు సైతం నిండకపోవడం వల్ల చెరువుకు నీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. విషయాన్ని ఎంఎల్ఏ మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తన సొంత నిధులు కేటాయింపు చేస్తానని తెలిపారని, మిగిలిన అవసరమైన నిధులు రైతులు చందాలు వేసుకోవాలని స్కీమును పునరుద్ధరణ చేసుకోవాలని సూచించారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు చందాలు వేసుకునే పరిస్థితి లేనందున జిల్లా కలెక్టర్ రైతుల బాధలను అర్థం చేసుకొని ప్రభుత్వ నిధుల ద్వారా కనుపూరుపల్లె వద్ద ఉన్న స్కీమును పునరుద్ధరింపజేసి రైతులను ఆదుకోవాలన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని పెగళ్లపాడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోలేరమ్మ దేవాలయ నిర్మాణానికి వైసిపినేత దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్ రెడ్డి రూ.1లక్ష విరాళాన్ని వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీనివాసులు యాదవ్‌కు అందజేశారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి పెగళ్లపాడు గ్రామంలో నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమానికి విచ్చేసిన ఆయనను గ్రామస్తులు కలసి పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. వెంటనే స్పందించి శనివారం గ్రామస్తుల సమక్షంలో విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న సాంప్రదాయాలను కాపాడుకోవాలని, దానికోసం తనవంతు కృషి చేయడంలో ముందు ఉంటానన్నారు. దేవాలయ నిర్మాణానికి సహకరించిన కృష్ణప్రసాద్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. వైసిపి మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, ఇర్లపాడు ఎంపిటిసి అబ్దుల్లా, బూదవాడ సొసైటీ మాజీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, నాయకులు జనార్ధన్ రెడ్డి, శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీటలు వారుతున్న పంటపొలాలు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో రబీ సీజన్ ప్రారంభమైనప్పటికీ పంటలు సాగుబడి చేసుకొనేందుకు అవసరమైన నీరు పంట కాలువల్లో లేకపోవడంతో పచ్చటి పొలాలు బీడువారిపోతున్నాయి. ఐఎబి సమావేశాలు నిర్వహించుకొని ప్రాజెక్టులో ఎంత నీరు ఉంది, పంట సాగుబడికి ఎంత నీరు అవసరం, ఉన్న నీటిని ఎంత వరకు వినియోగించుకొని పంటలు పండించుకోవడం సాధ్యమవుతుందో జిల్లా అధికారులు ప్రకటించాల్సి ఉంది. ఎటువంటి సమావేశాలు నిర్వహించకుండా రైతులు నారుమళ్లకు సంబంధించిన పనులు ప్రారంభించరాదని, రైతులు పంట సాగుబడి చేసేందుకు అవసరమైన నీటిని అందించలేమని, ప్రత్యామ్నాయ పంటల సాగుబడి చేసుకొనేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా రైతాంగానికి నోటిమాటగా ప్రకటనలు చేశారు. దాంతో కోవూరు ప్రాంతంలోని రైతులు జిల్లా అధికారులు ఐఎబి సమావేశం నిర్వహించి పంటల సాగుకు అవసరమైన నీటిని సరఫరా చేసుందుకు చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. రైతుల ఆందోళన చేయడంతో కలెక్టర్ ఐఎబి సమావేశం నిర్వహించి పంట సాగుబడి చేసేందుకు నీరు విడుదల చేయడం సాధ్యమవుతుందా లేదా అనేది ప్రకటించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ప్రజారక్షణ భేరీ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో మూడు ప్రాంతాల నుంచి బస్సు యాత్రలు ప్రారంభించారు. ఈ బస్సు యాత్ర నగరానికి చేరుకొని సర్వేపల్లి, ముత్తుకూరు, నెల్లూరు నగరం, కందుకూరు తదితర ప్రాంతాల్లో బహిరంగ సభలను నిర్వహించారు. ఈ బహిరంగ సభలకు ప్రజల నుంచి విశేష స్పందన కనిపించింది. ఈ బస్సు యాత్ర ముగింపులో భాగంగా 15వ తేదిన విజయవాడలోభారీ స్థాయిలో బహిరంగ సభ నిర్వహించేందుకు సిపిఎం రాష్ట్ర కమిటీ సిద్ధమైంది. ఈ సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు, ప్రజలు హాజరైయ్యేందుకు సిద్ధమవుతున్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేయకుండా ప్రభుత్వ పరిధిలోనే ఉంచుకోవాలని, ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటీకరణ పేరుతో కార్పోరేట్ శక్తులకు దారాదత్తం చేయరాదంటూ ప్రజలు చేస్తున్న ఆందోళనకు వెయ్యి రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని విద్యార్థి యువజన సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. ఈ బంద్ సందర్భంగా నగరంలో పోలీసు సిబ్బందికి, యువజన సంఘాలు, విద్యార్థి సంఘాకు వాదులాటలు చోటు చేసుకోవడం, పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాలు బంద్ చేస్తున్న ప్రాంతంలో ఉద్రికత్త నెలకొంది. ఆర్‌టిసి బస్సు డ్రైవర్‌పై దాడికి పాల్పడిన కావలికి చెందిన వ్యక్తులను పోలీసులు అరెస్టు చేయడంతో, ఆ ముఠా సభ్యుల అసలు వ్యవహారం బహిర్గతం కావడం, రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ముఠాకు సంబంధించిన ప్రధాన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో అతని ఇంటిని తనిఖీ చేసే సమయంలో పోలీసుల కంట పడిన మరణాయుధాలు పోలీసులు సైతం ఉలిక్కిపడ్డారు.

వీక్షణం

బీద రవిచంద్రను కలిసిన ఎస్‌టిసెల్

ప్రజాశక్తి-నెల్లూరు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్‌ను మాగుంట లే అవుట్‌లో ఆయన నివాసంలో శనివారం రాష్ట్ర ఎస్‌టి సెల్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ రాష్ట్ర ఎస్‌టిసెల్ ఉపాధ్యక్షురాలుగా నూతనంగా నియమితులైన కత్తి పద్మ నేతృత్వంలో గిరిజన నేతలు బీద రవిచంద్రను సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బా నాయుడు, రాష్ట్ర ఎస్‌టిసెల్ కార్యదర్శులు మొగిలి.కల్లయ్య, కుడుముల గోపాల్, తిరుపతి పార్లమెంట్ ఎస్‌టిసెల్ అధ్యక్షులు సుబ్బయ్య, అధికార ప్రతినిధి కళావతి, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

ప్రజాశక్తి కోవూరు : స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలందించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ 123వ జయంతి కార్యక్రమాన్ని శనివారం సీతాపోలయ్య భవనంలో నిర్వహించారు. ఈ మేరకు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ జయంతి కార్యక్రమంలో ఆవాజ్ సీనియర్ నాయకులు ఖాదర్‌బాషా మాట్లాడుతూ తొలి విద్యాశాఖ మంత్రిగా ఆయన ఎన్నో సేవలు అందించారన్నారు. మండల నాయకులు మహబూబ్ బాషా, ఎస్ కే చాన్‌బాషా, మాభాషా, మస్తాన్ అన్న బాబు, సుబ్బారావు, బాబు, మేస్త్రి నజీర్ పాల్గొన్నారు.

దుకాణాల్లో పరిశీలన

ప్రజాశక్తి-సంగం : శివాలయం సెంటర్లో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాలను శనివారం తహశీల్దార్ నాగరాజు పరిశీలించారు. దుకాణాల యజమానులు లైసెన్స్ పొందారా లేదా అని తనిఖీ చేశారు. దుకాణాల వద్ద ఫైర్ నియమనిబంధనలు అమలును పరిశీలించారు. లైసెన్స్ లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ ప్రశాంత వాతావరణంలో దీపావళి పండుగను జరుపుకోవాలని సూచించారు.

In the Court of the I Addl. District Judge : Nellore
O.S.No. 62 / 2023
Shaik Noorjahan - Plaintiff
Vs
1. Shaik Kalesha
and 7 others - Defendants
Notice
To,
D7. **Shaik Yasmin,** Daughter of Late **Mastan Vali,** residing at Door No. 23/1399, Tekkemitta, Fathekhanpet, Nellore City.
పై నెంబరున వాది పై తెలిపిన కోర్టులో మీపై పార్టీషన్ దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే04-12-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టు లో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎన్.శ్రీనివాసులు రెడ్డి, బి.ఎస్‌సి., బి.ఎల్.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the III Addl. District Judge, Nellore
I.A.No. 277 / 2023
O.S.No. 28 / 2020
Chaluvadi Nageswara Rao - Petitioner/Plaintiff
Vs
1. **Chaluvadi Venkateswara Rao,**
2. **Chaluvadi Satyanarayana,**
3. **Chaluvadi Surya Narayana,**
4. **Chaluvadi Lakshmi Narayana,**
5. **Chaluvadi Manjula,**
- Respondents / Defendants
6. **M/s. Sri Venkata Ramana Dallmill,** Rep.by its Managing Partner, **Chaluvadi Venkateswara Rao**
- Respondent / Proposed Party
Notice to 6th Respondent
M/s. Sri Venkata Ramana Dallmill, Rep. by its Managing Partner, **Chaluvadi Venkateswara Rao,** Plot No.E-32& E-33, Industrial estate, A.K. Nagar, Nellore-4.
పై నెంబరున పిటిషనరు/వాది పై దావా O.S.No. 28/2020 లో మిమ్మల్ని ప్రపోజ్డ్ పార్టీ (6వ ప్రతివాది) గా చేర్చమని కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియు న్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే 21-11-2023 ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
డి. వెంకట రామయ్య, బి.కాం., బి.ఎల్.,
పిటిషనరు / వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

DOCUMENT LOST
I, **KOLLI RAMADEVI** W/o SANKAR REDDY residing at James Garden, Nellore, SPSR Nellore District, AP affirm that I have purchased house Plot vide Document No. **4982/2010** registered at Nellore SRO, Property situated at Vaviletipadu Village, Nellore Rural Mandal, SPSR Nellore Dt. AP. has been lost while shifting the house from Vedayapalem on 10-10-23. Finder Please inform at the above address.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
O.S.No. 155/2010
వేమూరి శ్రీనివాసులు - వాది
వర్సెస్
వేమూరి కొండమ్మ,
మరియు వగైరాలు - ప్రతివాదులు
నోటీసు
టు,
D5. **గాథంశెట్టి సుబ్బారావు,** S/o **శ్రీహరి,** డోరు నెం.9/27/10, మానస హాల్ వీధి, కావలి టౌన్ మరియు మునిసిపాలిటీ, SPSR నెల్లూరు జిల్లా.
పై నెంబరు దావాలోని పరిహారం డిక్రీ కోరి మీ మీద మరియు మరికొందరు మీద వాది పై దావా దాఖలు చేసియుండుట వలన మీరు స్వయంగా కాని, మీ నుంచి సంపూర్ణ సంజాయిషీ పొందిన లాయరు ద్వారా కాని సదరు దావా ప్రత్యుత్తరములు చెప్పగలందుకు **తేది: 07-12-2023 దికి** వాయిదా వేయబడియున్నది. కావున పై తేదీన **ఉదయం 10:30 ని॥లకు** పై కోర్టువారి యెదుట హాజరై మీ సంజాయిషీ తెలుపు కొనవలసిందిగా నిన్ను ఆదేశించడమైనది. పై తేదియందు మీరు హాజరుకాని యెడల మీ పరోక్షమందు పై దావా తీర్మానించెదరు.
వాయిదా : 07-12-2023
(పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
శ్రీ టి.గోపాలకృష్ణమూర్తి
వాది తరపు న్యాయవాది, కందుకూరు